26-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఇది మనుష్యుల నుండి దేవతలుగా తయారయ్యేందుకు చదువు, ఈ చదువులో కొద్దిగా కూడా నిర్లక్ష్యము చేయకూడదు, కేవలం పడుకున్నారు, తిన్నారు కానీ చదువుకోలేదంటే చాలా పశ్చాత్తాప పడవలసి ఉంటుంది"

ప్రశ్న:- ఏ విషయములో బ్రహ్మాబాబాను అనుసరించినట్లయితే ఉన్నతి జరుగుతూ ఉంటుంది?

జవాబు:- ఏ విధంగా బ్రహ్మాబాబా తన సర్వస్వాన్ని ఆహుతి చేసారో అనగా సర్వస్వాన్ని సమర్పణ చేసారో అలా బాబాను అనుసరించండి. ఉన్నతికి సాధనము - బాబా ద్వారా రచింపబడిన ఈ రుద్ర యజ్ఞములో తమ ఆహుతిని ఇవ్వడము అనగా బాబాకు సహాయకులుగా అవ్వడము. కానీ - నేను ఇంత సహాయం చేసాను, ఇంత ఇచ్చాను అన్న ఆలోచన కూడా ఎప్పుడూ రాకూడదు. బాబా అయితే దాత, వారి నుండి మీరు తీసుకుంటారే కానీ ఇవ్వరు.

పాట:- నీవు నిదురించి రాత్రిని పోగొట్టుకున్నావు... (తూనే రాత్ గవాయి సోకే...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు, దీనిపై కూడా పిల్లలు అర్థం చేయించాలి. తండ్రి అంటారు - నేను పిల్లలతో మాట్లాడతాను. ఇంకెవ్వరూ ఈ విధంగా అనలేరు. సాధు-సన్యాసులు, మహాత్ములు అయితే ఎంతోమంది ఉన్నారు. వీళ్ళలో శక్తి ఉంది అని కొందరు అంటారు. వీరైతే అందరికీ తండ్రి, వీరు కూర్చొని అర్థం చేయిస్తారు. ఎంతోమంది పిల్లలు ఉన్నారు, వారు రోజంతా కేవలం తింటారు, త్రాగుతారు మరియు నిద్రపోతారు, చాలా నిద్రపోతారు. దీని వలన ఏమవుతుంది? వజ్రతుల్యమైన జన్మను పోగొట్టుకుంటారు. మాయ ఎంతో నిర్లక్ష్యం చేయిస్తుంది. కుంభకర్ణుని నిద్రలో మాయ నిదురింపజేసేసింది. ఇప్పుడు మేల్కొలిపేవారు వచ్చారు, కావున అజ్ఞాన నిద్ర నుండి మేల్కోండి. మొత్తం సృష్టిలో, అందులోనూ ముఖ్యంగా భారత్ లో అజ్ఞానమే అజ్ఞానముంది. కావున తండ్రి అంటారు, ఇప్పుడు నిర్లక్ష్యం చేసినట్లయితే చాలా-చాలా పశ్చాత్తాప పడవలసి ఉంటుంది, కానీ అప్పుడు పశ్చాత్తాప పడడం వలన ఏ ఉపయోగము ఉండదు. ఇక్కడ ఇది మనుష్యుల నుండి దేవతలుగా తయారయ్యేందుకు చదువు. ఈ విధంగా ఇంకెవరూ చెప్పలేరు. ఇక్కడ కూడా అదే జ్ఞానముంది అని కాదు. ఈ చదువు పూర్తిగా కొత్తది. ఆది సనాతన దేవీ-దేవతా ధర్మము యొక్క స్థాపన జరుగుతుంది. ఆ మాటకొస్తే ఇక్కడ కూడా దేవి అని ఎంతోమందిని అంటారు. స్త్రీలు దేవీలైతే, పురుషులు దేవతలవుతారు. కానీ మనమైతే సత్యయుగంలో దేవీ-దేవతా పదవిని పొందేందుకు పురుషార్థం చేస్తున్నాము, అది కూడా తప్పకుండా సత్యయుగ స్థాపన చేసేవారే ప్రాప్తింపజేస్తారు. అన్ని సత్సంగాలతో పోలిస్తే ఇక్కడ ఈ విషయము అతీతమైనది. ఎవరైతే ఈశ్వరుడిని సర్వవ్యాపి అని అంటారో మరియు వారికి అనేక అవతారాలు ఉన్నాయి అని అంటారో, వారిని ఇలా అడగండి - ఒకవేళ ఈశ్వరుడు సర్వవ్యాపి అయినట్లయితే మరి వారిని అవతారము అని అంటున్నవారు కూడా తప్పకుండా ఈశ్వరుని అవతారమే అవుతారు. అచ్ఛా, మరి అలా అయితే రచన యొక్క ఆదిమధ్యాంత రహస్యాన్ని తెలియజేయండి అని అడిగితే, వారు ఏమీ చెప్పలేకపోతారు. రకరకాలవారు ఉంటారు, రిద్ధి-సిద్ధి చేసేవారు కూడా ఉన్నారు. కొత్త ఆత్మ వచ్చినప్పుడు తాను కూడా తన శక్తిని చూపిస్తుంది. ధర్మస్థాపన చేయడానికి కొత్త ఆత్మ ప్రవేశించినప్పుడు, వారి పేరు ప్రఖ్యాతమవుతుంది. ఇక్కడ శక్తి యొక్క విషయము కాదు. మీరు అంటారు - శివబాబా, మేము మీ నుండి స్వర్గ వారసత్వాన్ని తీసుకునేందుకు వచ్చాము. దీనినే ఈశ్వరీయ జన్మ సిద్ధ అధికారము అని అంటారు. మీరు ఈశ్వరీయ సంతానము. ఏ సాధు-సన్యాసులు, మహాత్ములు - మేము బాప్ దాదాకు పిల్లలము అని అనరు.

మనం స్వర్గ వారసత్వాన్ని తీసుకుంటున్నామని మీకైతే తెలుసు. బాబా అంటారు - పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలంటే తండ్రి స్మృతిలో ఉండండి. తండ్రి ఇక్కడే చదివిస్తారు. రాజ్యస్థాపన జరిగిపోయిందంటే ఇక ఈ చదువు మరియు చదివించేవారు మాయమైపోతారు. ఈ బ్రాహ్మణ కులము ఇప్పుడే ఉంది. మేము బ్రహ్మా యొక్క సంతానము అని అంటారు. మరి బ్రహ్మా ఎప్పుడు వచ్చారు? బ్రహ్మా సంగమములోనే వస్తారు కదా. ప్రజాపిత బ్రహ్మా ఏ బ్రాహ్మణులనైతే రచిస్తారో, వారు దేవీ-దేవతలుగా అవుతారు, ఇక ఆ తర్వాత బ్రాహ్మణులైతే ఉండనే ఉండరు. మనము మళ్ళీ దేవతా కులములోకి వెళ్ళిపోతాము. ఆ తర్వాత కర్మకాండల కొరకు పూజారీ బ్రాహ్మణులు ఎవరైతే ఉంటారో, ఆ కర్మకాండలను ఋషులు, మునులు మొదలైనవారు ప్రారంభించి ఉంటారు. ద్వాపరంలో శివాలయాలు మొదలైనవాటిని నిర్మించి పూజను ప్రారంభించినప్పుడు, పూజ్య దేవీ-దేవతలు ఎవరైతే ఉండేవారో వారు పూజారులుగా

అవుతారు. ఆ సమయంలో మందిరాలలో బ్రాహ్మణులు కావాలి, కావున అదే సమయంలో పూజ్యుల నుండి పూజారులుగా అయినవారే బ్రాహ్మణులుగా ప్రారంభమై ఉంటారు, వాస్తవానికి వారిని బ్రాహ్మణులు అని అనరు. మందిరాలలో విగ్రహాల ఎదుట బ్రాహ్మణులు తప్పకుండా ఉంటారు. కావున ఆ సమయంలోనే ఆ బ్రాహ్మణులు కూడా వెలువడి ఉంటారు. ఇది విస్తారమైన సమాచారము. వాస్తవానికి దీనితో కూడా జ్ఞానానికి సంబంధము లేదు. జ్ఞానం కేవలం 'మన్మనాభవ' అని చెప్తుంది. పిల్లలైన మీకు - శివబాబాను మరియు వారసత్వాన్ని స్మృతి చేయండి అని చెప్పడం జరుగుతుంది, మరి కేవలం స్మృతి చేయడం ద్వారా అందరూ లక్ష్మీ-నారాయణులుగా అయిపోతారా? అవ్వరు. చదువు కూడా ఉంది. ఎంత ఎక్కువ సేవ చేస్తారో, అంత ఉన్నత పదవిని పొందుతారు, అంతగా మీ నోట్లో బంగారు చెంచా ఉంటుంది. కొత్త ప్రపంచం తయారవ్వడానికి, పరివర్తన చెందడానికి సమయమైతే పడుతుంది కదా. వినాశనం తర్వాత స్థాపన జరుగుతుంది. కలియుగం తర్వాత సత్యయుగం వస్తుంది. భూకంపాలు మొదలైనవి జరుగుతూ ఉంటాయి కానీ అనేక ధర్మాల వినాశనము జరుగనున్నది. డ్రామా పూర్తవుతుంది. ఇప్పుడు మనం బాబా వద్దకు వెళ్ళి మళ్ళీ కొత్త ప్రపంచంలోకి వస్తాము. ఈ సమయంలో మనము ఈ యజ్ఞానికి బ్రాహ్మణులము. శివబాబా 5,000 సంవత్సరాల క్రితం వలె రుద్ర యజ్ఞాన్ని రచించారు. ఇది అత్యంత పెద్ద యజ్ఞము, ఈ యజ్ఞాన్ని సత్యమైన బ్రాహ్మణులైన మీరు సంభాళిస్తారు. ఆ బ్రాహ్మణులైతే స్థూలమైన యజ్ఞాలను రచిస్తారు. ఏవైనా ఆపదలు మొదలైనవి వచ్చేది ఉంటే యజ్ఞాలను రచిస్తారు. సత్యయుగంలో గురువులు మొదలైనవారి అవసరం ఉండేది కాదు. ఎక్కడైతే సద్గతి అవసరం ఉంటుందో అక్కడ గురువులు ఉంటారు. ఇప్పుడు ఇక్కడైతే అనేకమంది గురువులు ఉన్నారు. ఇన్ని వేద-శాస్త్రాలు మొదలైనవి ఉన్నా కూడా భారత్ కు ఇటువంటి పరిస్థితి ఎందుకు వచ్చింది?

5,000 సంవత్సరాల క్రితం వలె మనుష్యులందరూ కుంభకర్ణుని ఘోర నిద్రలో నిదురిస్తున్నారు అని మీరు వ్రాయవచ్చు. నిద్రనైతే అందరూ నిదురిస్తారు, కానీ ఇది అజ్ఞాన నిద్ర యొక్క విషయము. సద్గతిని ఇవ్వగలిగే గురువులు ఎవ్వరూ లేరు. ఇప్పుడు ప్రకాశాన్ని తీసుకువచ్చేవారు ఎవరు? పరమపిత పరమాత్మ లేకుండా ప్రకాశము రాలేదని పిల్లలైన మీకు అర్థం చేయించడం జరిగింది. ఇప్పుడైతే ఎంతోమంది గురువులు ఉన్నారు. అయినా కానీ అంధకారమయమైన రాత్రి, దుఃఖము ఎందుకు ఉంది? సత్యయుగంలోనైతే అపారమైన సుఖము ఉండేది. ఇప్పుడు భగవంతుని శ్రీమతము లభించినప్పుడు సుఖము ఉంటుంది. రావణుడే భారత్ ను పతితముగా, దుఃఖితముగా చేసాడు. తండ్రి అంటారు - ఈ కామము అనే మహాశత్రువును జయించండి, పవిత్రతా ప్రతిజ్ఞను చేయండి, అప్పుడే కొత్త ప్రపంచానికి యజమానులుగా అవుతారు. గురువులు ఎప్పుడూ పవిత్రంగా అవ్వండి అని చెప్పరు. ఇప్పుడు మీరు అత్యంత ప్రకాశంలోకి వచ్చారు, కావున మీరు వెళ్ళి అడగండి - భారత్ ఏదైతే ఎంతో సుఖవంతంగా ఉండేదో అది ఇప్పుడు ఇంత దుఃఖితముగా ఎందుకు అయ్యింది. మనమే మళ్ళీ దేవతలుగా అవుతామని పిల్లలైన మీకు తెలుసు. సన్యాసులైతే వెంటనే ఇళ్ళు-వాకిళ్ళను వదిలి వెళ్ళిపోతారు. సన్యాసులు పావనమైనవారు అని వారి గురించే అంటారు. వారేమీ - మేము పావనముగా అయ్యేందుకు పురుషార్థం చేస్తున్నామని అనరు. మీ విషయం వేరు. సన్యాసులందరూ పవిత్రంగా ఉంటారని భావించకండి. ఎప్పటివరకైతే అవస్థ దృఢంగా అవ్వదో, అప్పటివరకూ బుద్ధియోగము మిత్ర-సంబంధీకుల వైపుకు వెళ్తూ ఉంటుంది. దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలను మరవండి అని మీకు చెప్పడం జరిగింది, దాని కొరకు ఎంతగా కష్టపడాల్సి ఉంటుంది. మీరు సన్యాసం ఎప్పుడు తీసుకున్నారు, మీ లౌకిక పేరు ఏమిటి? అని వారిని అడిగినప్పుడు, వారు అంటారు - ఈ విషయాలను అడగకండి, వాటిని ఎందుకు గుర్తు తెప్పిస్తారు. అయితే కొంతమంది జవాబిస్తారు, అప్పుడు వాళ్లను ఇలా అడగడం జరుగుతుంది - మీరు అందరినీ వెంటనే మర్చిపోయారా లేక గుర్తుకొస్తూ ఉంటారా? మీరు ఎవరు, ఎలా విడిచిపెట్టారు, ఒంటరిగా ఉండేవారా లేక పిల్లా-పాపలు ఉండేవారా, మరి వారు మీకు గుర్తుకొస్తూ ఉంటారా? అన్నదైతే తెలియాలి కదా. అప్పుడు వారంటారు - అవును, ఎంతోకాలం గుర్తుకొచ్చేవారు, కష్టం మీద స్మృతి తొలగుతుంది. తమ జీవితమైతే గుర్తుంటుంది కదా. మనమూ శివబాబాను స్మృతి చేస్తాము, కానీ మనం మన జీవితాన్ని లేక మనం చదివిన శాస్త్రాలు మొదలైనవాటిని మర్చిపోతామా. బాబా అంటారు - కేవలం జీవిస్తూ మర్చిపోండి, దీనిని ధారణ చేయండి, వాటిని గుర్తు చేసినట్లయితే వాటికి వేలాడుతూ ఉంటారు. మొదట ఈ విషయాలను వినండి, ఆ తర్వాత నిర్ణయించుకోండి. జీవిస్తూనే మరజీవాగా అవ్వండి, ఇంకెవ్వరిదీ వినకండి. మనము మన జీవితమంతటి గురించి చెప్పగలము. ఇప్పుడు ఈ ప్రపంచము ఇక అంతమవ్వనున్నది అనైతే తెలుసు. సెంటర్లు వృద్ధి చెందుతూ ఉంటాయి. ఎవరైతే బాబా-మమ్మా అని అంటారో, వారు బ్రాహ్మణులు అవుతారు. ఓ ఆత్మల్లారా, అని ఇప్పుడు తండ్రి అంటారు, ఆత్మయే మాట్లాడుతుంది. మీరు ఎవరు? అని మిమ్మల్ని అడిగితే, వెంటనే నేను ఆత్మను, చదువుకుంటున్నాను అని అంటారు. ఈ జ్ఞానము ఇప్పుడు మీకు లభించింది. మీ ఆత్మ ఈ ఇంద్రియాల ద్వారా చదువుకుంటుంది. ఆత్మ మరియు శరీరము, రెండూ ఉన్నాయి. ఆత్మయే

శరీరాన్ని తీసుకుంటుంది మరియు విడిచిపెడుతుందని, సంస్కారాలను ధారణ చేస్తుందని ఇప్పుడు మీకు తెలుసు. ఆత్మలమైన మనము సత్యయుగంలో పుణ్యాత్ములుగా ఉండేవారము, ఇప్పుడు పాపాత్ములుగా ఉన్నాము. ఇప్పుడు ఇది అంతిమ జన్మ. పరమాత్మలో ఏ జ్ఞానమైతే ఉందో దానిని ఇప్పుడు ఆత్మలైన మనకు చదివిస్తున్నారు. మిగిలిన మనుష్యులందరూ ఘోర అంధకారంలో ఉన్నారు. శాస్త్రాలు మొదలైనవన్నీ భక్తి మార్గానికి చెందినవి. వాటిని జ్ఞానము అనరు. జ్ఞానము పగలు మరియు భక్తి రాత్రి. గీతా రచయిత ఎవరు మరియు వారు ఎప్పుడు వచ్చారు? గీతను ఎప్పుడు వ్రాసారు? అని మీరు అడగవచ్చు. బాబా కూడా వ్రాస్తూ ఉంటారు, ఆ తర్వాత దాని గురించి లోతుగా చింతన చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా బుద్ధిలో ధారణ చేయడం ద్వారా ఇక మీ ఉన్నతి జరుగుతూ ఉంటుంది. తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి, పిల్లలకు మాల యొక్క రహస్యం కూడా అర్థం చేయించడం జరిగింది. పరమపిత పరమాత్మ అనంతమైన పుష్పము, ఆ తర్వాత ఉన్న రెండు మణిపూసలు బ్రహ్మ-సరస్వతి. ప్రజాపిత బ్రహ్మ ద్వారా రచన రచించడం జరిగింది. వీరు ఆదిదేవుడు మరియు ఆదిదేవి. వీరు బ్రాహ్మణులు, వీరు స్వర్గాన్ని తయారుచేసారు, కావుననే వీరికి పూజ జరుగుతుంది. మధ్యలో సూర్యవంశీయులుగా తయారైన 8 మంది మణులు ఉన్నారు, వారు ఎంతో సహాయం చేసారు. జ్ఞానము బుద్ధిలో ఉండాలి. యజ్ఞంలో తప్పకుండా ఆహుతి వేయడం జరుగుతుందని కూడా తెలుసు. మాతల ఉన్నతి కొరకు బాబా యుక్తిని రచించారు. బలిహారమయ్యారు కదా, కావున ఫాలో ఫాదర్. గాంధీకి కూడా ఎవరైతే సహాయం చేసారో, వారికి అల్పకాలికమైన సుఖము లభించింది. అతను హద్దులోని తండ్రి, వీరు అనంతమైన తండ్రి.

ఇక్కడ బాబా తమ సర్వస్వాన్ని మాతల చరణాలపై అర్పించారు, కావున వీరు మొదటి నంబరులోకి వెళ్ళారు. పిల్లలైన మీరు పురుషార్థం చేయాలి, ఎవరైతే సహాయం చేస్తారో వారే స్వర్గాధిపతులుగా అవుతారు. ఎవ్వరూ మేము శివబాబాకు సహాయం చేస్తున్నాము అని భావించకండి, అలా కాదు. శివబాబాయే మీకు సహాయం చేస్తారు. అరే, వారు దాత, మీరు మీ కొరకే చేసుకుంటారు. మీరు స్మృతిలో ఉన్నట్లయితే వికర్మలు వినాశనమవుతాయి. స్వర్గాన్ని స్మృతి చేసినట్లయితే స్వర్గంలోకి వెళ్ళిపోతారు. బాబా స్వయం మన్మనాభవ అని అంటారు, లేకపోతే ఉన్నత పదవి ఎలా లభిస్తుంది? లెక్క చూసుకోవడం మీ పని. ఎవ్వరూ కూడా - నేను ఇస్తున్నాను అని భావించకండి. ఇది శివబాబా యజ్ఞము, ఇది కొనసాగుతూ ఉంది, ఇలా కొనసాగుతూనే ఉంటుంది.

మేము కేవలం భారత్ లోనే కాదు, సంపూర్ణ విశ్వమంతటిలోనూ తండ్రి సహాయంతో మా రాజ్యస్థాపన చేసుకుంటున్నామని సత్యమైన బ్రాహ్మణులైన మీ హృదయంలో ఉంది. మేము మళ్ళీ పవిత్రంగా అయి భారత్ ను స్వర్గముగా తయారుచేసి రాజ్యం చేస్తాము. శివబాబా మతముపై నడుచుకోవడం ద్వారా భారత్ స్వర్గంగా అయిపోతుంది. కావున శివబాబా చదివిస్తున్నారు అన్నది గుర్తుంచుకోండి. బాబా అంటారు - ఎప్పుడైతే బ్రాహ్మణులుగా అవుతారో, అప్పుడే దేవతా సాంప్రదాయంలోకి వస్తారు. వికారాలలో పడిపోవడం వలన పూర్తిగా సర్వనాశనమైపోతారు. దాని వలన తమకు తామే స్వయంపై కృపను చూపించుకునేందుకు బదులుగా అకృపను చూపించుకుంటారు, కావున శ్రాపితులైపోతారు. నేను వరదానము ఇవ్వడానికి వచ్చాను. కానీ శ్రీమతంపై నడవకపోవడం వలన తమను తామే శ్రాపితులుగా చేసుకుంటారు, పదవిని భ్రష్టము చేసుకుంటారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. బుద్ధి ద్వారా సర్వమునూ మర్చిపోయేందుకు జీవిస్తూనే మరణించాలి. ఒక్క బాబా వినిపించేదే వినాలి. తమ ఉన్నతి కొరకు పూర్తిగా బలిహారమవ్వాలి.

2. శ్రీమతముపై నడుస్తూ స్వయంపై కృప చూపించుకోవాలి. సత్యమైన బ్రాహ్మణులుగా అయి యజ్ఞాన్ని సంభాళించాలి. చదువును బాగా చదువుకుని ఉన్నత పదవిని పొందాలి.

వరదానము:- సేవను బాబా ముందు బుద్ధి ద్వారా అర్పణ చేసి నిశ్చింతగా ఉండే సఫలతా స్వరూప భవ

ఏది ఎంతటి కష్టమైన సేవ అయినా కానీ ఆ సేవను బాబా ముందు బుద్ధి ద్వారా అర్పణ చేసేయండి. నేను చేసాను, కానీ సఫలత లభించలేదు అన్న ఈ నేను అన్నదానిని తీసుకురాకండి. ఇది బాబా సేవ,

బాబా తప్పకుండా చేస్తారు అంటూ బాబాను ముందు ఉంచండి, అప్పుడు సదా నిశ్చింతగా ఉంటారు మరియు సఫలత కూడా లభిస్తుంది. ఎప్పుడూ బలహీన సంకల్పాల యొక్క బీజాన్ని నాటకండి. సేవనైతే చేస్తున్నాను కానీ బాబా సహాయమైతే లభించడం లేదు, బహుశా నేను యోగ్యుడిని కాదేమో, ఇవి కూడా వ్యర్థ సంకల్పాలే, ఇవి సఫలతను దూరం చేస్తాయి.

స్లోగన్:- ఎవరి స్మృతి రూపీ జ్యోతి సదా వెలిగి ఉంటుందో వారే బ్రాహ్మణ కులదీపకులుగా అవ్వగలుగుతారు.